క్లుప్తంగా

జగన్ ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం

మధురపూడి: జగన్ ప్రభుత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గాడాల హైస్కూల్లో ప్రహరీ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునికంగా మారాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

85 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

రాజానగరం: దివాన్ చెరువులోని విజేస్ ఫార్మసీ కాలేజీలో ఒమోగ హెల్త్‌కేర్ (చెన్నై) సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 85 మంది బి.ఫార్మసీ ఫైనలియర్ విద్యార్థులు ఎంపికయ్యారు. మెడికల్ కోడింగ్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు వంద మంది హాజరయ్యారు. ఎంపికైన వారికి రూ.2.6 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి. నరేంద్ర తెలిపారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలు



మేడే జెండా ఎగురవేస్తున్న కర్నాకుల

గోకవరం: మేడే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాట పంథాలో పయనించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా రంపయర్రంపాలెంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన జెండా ఎగురవేశారు. గ్రామంలోని సుమారు 89 ఎకరాల సుందరమ్మ సత్రం భూములను ఏళ్ల తరబడి కొంతమంది తమ ఆధీనంలో ఉంచుకుని అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. ఈ భూములపై సంఘం ఆధ్వర్యంలో మేడే స్ఫూర్తితో అలుపెరగని పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంచారు.. మంచిని పంచారు..

- హిందీ మాస్టారు వెలగల సత్యనారాయణరెడ్డి జీవితం ఆచరణీయం
- ఆయన సేవల్ని తలచుకుంటున్న ప్రజానీకం

బిక్కవోలు: ఆధ్యాత్మికం ఆయన మార్గం.. ప్రకృతి పరిరక్షణ ఆయన జీవితం.. ఆయనే బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు వెలగల సత్యనారాయణరెడ్డి. పచ్చదనం పెంచేందుకు, ఆధ్యాత్మికతను నలుదిశలా వ్యాప్తి చేసేందుకు ఆయన చేసిన కృషిని కొంకుదురు పరిసర గ్రామాల్లో తలచుకోని వారుండరు.. నిరంతరం సమాజం కోసం పనిచేస్తూనే ఉండాలని ఆయన చేసి చూపించారు. సత్యనారాయణరెడ్డి మరణంతో ఆయన సన్నిహితులే కాదు.. నేడు వృక్షాలుగా మారిన ఆయన నాటిన మొక్కలూ గొల్లుమంటున్నాయి.

ఎటుచూసినా ప్రకృతి పరవశమే

కొంకుదురు బుడతలమామిడికి వెళ్లి చూస్తే గోదావరి కాలువ గట్టున కిలోమీటరు మేర రోడ్డుకి ఇరువైపులా పరుచుకున్న పచ్చదనానికి పరవశించనివారుండరు. ఎటు చూసినా అంతెత్తున ఎదిగి నీడనిచ్చే వృక్షాలే.. ఎక్కడ కూర్చున్నా పక్షుల కిలకిలరావాలే.. అందుకే ఎక్కడెక్కడి నుంచో విద్యార్థులు, ఉద్యోగార్థులు బుడతలమామిడికి చేరుకుని అక్కడి ప్రకృతి ఒడిలో బెంచీలపై కూర్చుని ప్రశాంతమైన వాతావరణంలో చదువుకుంటుంటారు. అంతటి ప్రశాంత వాతావరణానికి, పచ్చదనానికి బీజం పడింది మాత్రం 1970ల ప్రాంతంలో అంటే నమ్మగలరా.. సుమారు 50 ఏళ్ల క్రితం నవ యువకుడిగా ఉన్న సత్యనారాయణరెడ్డి హిందీ భాషా ఉపాధ్యాయునిగా వృత్తి జీవితం ప్రారంభించిన నాటి నుంచే తన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. తన తొలి జీతంతో బుడతలమామిడి క్షేత్రంలోని త్రిముఖలింగేశ్వరుని ఆలయానికి చుట్టూ ప్రదక్షిణ కోసం బాట వేయించారు. ఆపై పలువురు దాతల్ని కలుపుకుంటూ ఆ క్షేత్ర అభివృద్ధి కోసం పాటుపడుతూనే వచ్చారు. తన శిష్య బృందంతో కలిసి కొంకుదురు బుడతలమామిడి వద్ద పచ్చదనం పెంచాలన్న సంకల్పంతో మొక్కలు నాటడం మొదలుపెట్టారు. నేడు అవే మొక్కలు వృక్షాలై ఎందరికో నీడనిస్తున్నాయి. ఆ హరిత సౌందర్యం అటు పాదచారులకి, ఇటు భక్తులకు అద్భుతమైన అనుభూతినందిస్తోంది.



త్రిముఖలింగేశ్వరుని సేవలో హిందీ మాస్టారు సత్యనారాయణరెడ్డి(ఫైల్)

ఆధ్యాత్మికత దిశగా అందరినీ పయనింపజేయాలని భగవద్గీతపై ఎంతో అధ్యయనం చేసిన ఆయన గీతాసారాన్ని భక్తులకు వివరించేవారు. గత మూడేళ్ళుగా ఆయన గొంతు పలకకపోయినా ఆయన నేర్పించిన భగవద్గీతాల ఆలాపనలతో వందల గొంతులు ఆయన స్వరానికి ప్రతిరూపాలుగా ధ్వనిస్తున్నాయి. సేవలోనే దైవం ఉన్నాడని నమ్మిన హిందీ మాస్టారు జీవితం భావితరాలకు ఆదర్శం.. ఆచరణీయం..

అన్నదాతలను ఆదుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీ వీరపాండ్యన్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అకాల వర్షాలతో అన్నదాతలు పడుతున్న కష్టాల్ని వీరపాండ్యన్‌కు వివరించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకవర్గ పరిధిలో చేతికొచ్చిన పంట దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారని, వారికి అండగా నిలిచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. బొండాలు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సివిల్ సప్లయిస్ ఎండీ వీరపాండ్యన్ అన్నదాతలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.



సివిల్ సప్లయిస్ ఎండీ వీరపాండ్యన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

షార్ట్‌ఫిలిమ్ షూటింగ్

సీతానగరం: చినకొండేపూడిలోని వేదాస్ ఆసుపత్రిలో షార్ట్ ఫిలిమ్ షూటింగ్ జరిగింది. మూడు రోజులుగా ఈ ఆసుపత్రిలో హార్ట్ ఎటాక్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఇప్పటికే మునికూడలి పుష్కర ఘాట్ వద్ద, ములకల్లంక, వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట గ్రామాల్లో షూటింగ్ జరిగింది. నిర్మాతగా సీహెచ్ మదుసూదన్, డైరెక్టర్‌గా సుధీర్ పెరుగు వ్యవహరిస్తున్నారు.

కన్నుల పండువగా కల్యాణం

అనపర్తి: మండలంలోని పొలమూరు రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి స్వామి అమ్మవార్ల శాంతికర కల్యాణం, గరుడ వాహన సేవ ఆద్యంతం కన్నులపండువగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని గరుడాళ్వార్‌లకు విశేష పూజాదికాలు నిర్వహించడంతో పాటు శాంతికర కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఉపసర్పంచి సత్తి సూరారెడ్డి, వ్యాపారవేత్తలు సత్తి బ్రహ్మారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

వైభవంగా వెంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. నిర్వాహకులు అనంతాత్ముల బాలాజీ, ఆయన సతీమణి ఉష నిర్వహణలో శ్రీనివాసం ట్రస్టు ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 7.10 గంటలకు పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ ప్రతిష్ఠ జరిగింది. స్వామివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో సందడి నెలకొంది. సాయంత్రం 6.35 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఏపీఎస్ఎన్ మూర్తి, చొంగా వెంకటేశ్వరరావు, కంటే సత్తిబాబు, మేకా నెహ్రూరాజు, ఏడిద పండు పాల్గొన్నారు.



రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నేడు కట్లమ్మ తల్లి జాతర

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కొలువైయున్న కట్లమ్మతల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం కట్టమ్మ తల్లి వార్షిక తీర్థం నిర్వహించనున్నారు.

నేడు లలితా సహస్ర నామార్చన

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న దుర్గాదేవికి శుక్రవారం లలితా సహస్ర నామార్చన నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. పౌర్ణమి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఉదయం, సాయంత్రం కుంకుమపూజ నిర్వహిస్తామన్నారు. భక్తులంతా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కంబాలచెరువు: జిల్లాలో గురువారం విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో 4,600 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. కోరుకొండ - రాజమహేంద్రవరం మధ్య ఆకస్మిక తనిఖీ చేసి, ఆటోలో తరలిస్తున్న సుమారు వెయ్యి కేజీల కేజీల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఈ బియ్యాన్ని అన్నపూర్ణమ్మ పేటకు చెందిన ఆటో డ్రైవరు ఎస్.సత్యనారాయణ కొలమూరు తరలిస్తున్నాడు. ఈ బియ్యం అదే ప్రాంతానికి చెందిన విశ్వేశ్వరరావుదిగా గుర్తించారు. అతను ఈ బియ్యాన్ని రేషన్‌కార్డులదారుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. వారి నుంచి రూ.2.40 లక్షల విలువైన వెయ్యి కేజీల రేషన్ స్వాధీనం చేసుకుని రాజానగరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యంపై విజిలెన్స్ అధికారులు గుర్తించారు. 72 బ్యాగుల్లో సుమారు 3,600 కేజీల పీడీఎస్ బియ్యం గుర్తించారు.

నగరానికి చెందిన లచ్చిరెడ్డి సురేష్ చంద్‌కు చెందినదిగా గుర్తించారు. అతను నిడదవోలు మండలంలో రేషన్ కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాటిని రూ.20కు యానాం పరిసర ప్రాంతాల్లో చేపల చెరువులకు విక్రయిస్తున్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు

గోకవరం: పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు గోకవరంలో శుక్రవారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని, ఆదివారం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నదానం జరుగుతుందని, ఈ కార్యక్రమాలను భక్తులు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: అనపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షారోనుపురం, రాముడమ్మపేట, మార్కెట్ ప్రాంతం, బుల్లియ్యగారి తోట, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని చెప్పారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: 2023 -24 ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల వివరాలను ముందుగా తెలియపర్చడం ద్వారా లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాన్ని అందించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డీపీఓ పి.జగదాంబ, ఎస్ఈ పీఆర్ ఎస్వీవీ ప్రసాద్, సీపీవో కె.ప్రకాశరావు, డీపీఆర్వో ఐ.కాశయ్య పాల్గొన్నారు.